పెద్ద ఎల్కిచర్లలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్, జనవరి 4 : చౌదరిగూడ మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో ప్రీమియర్ లీగ్-5 క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. ఐదేండ్లుగా గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్‌పటేల్, హఫీజ్, బాబురావు, సత్యప్రమోద్, వెంకట్రాములు, మానయ్య, పాండు, మోతీలాల్, సలీం, జబ్బార్, గౌస్, శేఖర్, సత్యం, చందు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి

కడ్తాల్, జనవరి 4 : తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన మోకురాల పుల్లమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం స్థానిక నాయకులతో కలిసి పుల్లమ్మ మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేలు అందజేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్ తరుపున రూ3 వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు జంగయ్య, నాయకులు ఆంజనేయులుగౌడ్, శరత్‌చంద్ర, కృష్ణ, అనిల్, రవీందర్, లక్ష్మయ్యగౌడ్, రమేశ్, మల్లయ్యగౌడ్, బుచ్చయ్య, రాజూ గౌడ్, జీవన్, శ్రీను, అనంతరాములు, నిరంజన్, సత్యనారాయణ, వంశీ ఉన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

కడ్తాల్‌లో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, జవనరి 4 : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఎర్రోళ్ల సత్తయ్య, రేఖ్యాతండాకు చెందిన తావుర్యా ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన శనివారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబాలకు రాదాకృష్ణ ట్రస్ట్ తరపున ఐదు వేల చొప్పున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, మాజీ సర్పంచ్ హరిచంద్‌నాయక్, మాజీ ఎంపీటీసీ రమేశ్‌నాయక్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ నాయక్‌అలీ, నాయకులు అశోక్, బాలయ్య, శివ గౌడ్, గణేశ్, యాదగిరి, అంజయ్య, మహేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

షాబాద్, జనవరి 4 : గ్రామ పంచాయతీ కార్మికులను వేధింపులకు గురి చేస్తున్న సర్దార్‌నగర్ పంచాయతీ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం షాబాద్ మండల పరిషత్తు కార్యాలయం ఎదుట సర్దార్‌నగర్ పంచాయతీ కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు కట్ చేస్తూ వేధింపులకు పాల్పడుతున్న సర్దార్‌నగర్ పంచాయతీ కార్యదర్శిని విధుల నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు నర్సింహ, పాపయ్య, శోభ తదితరులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే

మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్

షాబాద్, జనవరి 4: మహిళల అభ్యున్నతికి దారి చూపిన మార్గదర్శి, గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల పాఠశాలలో టీఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సావిత్రీబాయి పూలే దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వినోద, ఉపాధ్యాయులు గౌతమి, క్రాంతి, రాధిక, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి తదితరులు

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 4 : మున్సిపాలిటీ పరిధిలోని 1, 20వ వార్డుల్లో రూ.75లక్షలతో కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కొనసాగుతున్న పనులను ఆమె శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. డ్రైనేజీ పనుల్లో సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, కౌన్సిలర్ సుల్తానాబేగం, ఏఈ గుణాకర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

- మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కిషన్
- మున్సిపల్ కార్యాలయాల ఎదుట కార్మికుల ధర్నా

తుర్కయాంజాల్ : మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

తుర్కయాంజాల్, జనవరి 4 : మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందితో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6న కలెక్టరేట్ ముట్టడికి కార్మికులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్యనారాయణ, మున్సిపల్ కార్మికులు మహేశ్, వెంకటేశ్, భాగ్యమ్మ, మంకమ్మ, అండాలు, ఎల్లమ్మ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

పెద్దఅంబర్‌పేట : కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే తదితర పద్ధతుల్లో పని చేస్తున్న మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నర్సింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పారిశుధ్య కార్మికులతో కలిసి పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ.. కార్మికులకు రెండో పీఆర్సీలో కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలన్నారు. మున్సిపల్ కార్మికులకు కేటగిరీల వారీగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు శివకుమార్, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆమనగల్లు : మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు, శనివారం ఆమనగల్లులోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట : ధర్నా చేస్తున్న సీఐటీయూ జిల్లా నేత నర్సింహ, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది

ఆమనగల్లు : మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రోడ్ల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

తుర్కయాంజాల్, జనవరి 4 : మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శనివారం కొహెడ, బ్రాహ్మణపల్లిలో రూ.2 కోట్ల 41 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధతో కలిసి ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరిన్ని నిధులతో మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో తుర్కయాంజాల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ హరిత, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ అయిలయ్య, కౌన్సిలర్లు కొండ్రు మల్లేశ్, కంబాలపల్లి ధన్‌రాజ్, బాల్‌రాజ్, కొత్తకుర్మ మంగమ్మ, సునీల్, మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, డీఈ భిక్షపతి, నాయకులు కొంతం వెంకట్‌రెడ్డి, వంగేటి గోపాల్‌రెడ్డి, కుంట గోపాల్‌రెడ్డి, మేతరి దర్శన్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల సర్వే వేగవంతం చేయాలి

యాచారంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, జనవరి 4 : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను మండల పరిధిలో వేగవంతం చేయాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. సర్వే కొనసాగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల సర్వేను అన్ని గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో సర్వేను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మాడ్గుల, జనవరి 4 : సీఎం సహాయనిధి చెక్కులు పేదలకు వరం లాంటివని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నల్లచెరువు గ్రామానికి చెందిన కెంచ వెంకటమ్మకు రూ.18 వేల చెక్కు మంజూరైంది. ఆ చెక్కును బాధితురాలి భర్త వెంకటయ్యకు శనివారం ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నవీన్ గౌడ్, శ్రీశైలం, శివ, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై రవీందర్‌నాయక్

షాద్‌నగర్‌టౌన్, జనవరి 4 : రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యతని షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్సై రవీందర్‌నాయక్ అన్నారు. షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో శనివారం డీఎం ఉష ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ డ్రైవింగ్ చేస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. అలాగే ఆర్టీసీ డ్రైవర్లు ఎలాంటి ఒత్తిడి లేకుండా డ్రైవింగ్ చేయాలని, ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై అందరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ ఇంజినీర్ నాగులు, ఎస్‌డీఐ అర్జున్, ఉద్యోగులు వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్య సాధనకు నైపుణ్యాలు అవసరం

చేవెళ్లటౌన్, జనవరి 4 : జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని సాధించడానికి ఆంగ్లంలో నైపుణ్యాలు ఎంతో అవసరమని ఎంఈవో పురందాస్ తెలిపారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎస్‌సీఈఆర్‌టీ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఇంగ్లిష్ ఒలింపియాడ్ , ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభా పరీక్షల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న భాష నైపుణ్యాలు, జీవన నైపుణ్యాలు మెరుగుపడి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి తోడ్పడతాయని తెలిపా రు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ బాధితుడికి అప్పగింత

చేవెళ్లటౌన్, జనవరి 4 : షాద్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌ను వికారాబాద్ డిపో ఆర్టీసీ బస్సులో శుక్రవారం పోగొట్టుకున్నారు. వికారాబాద్ డిపో మేనేజర్ అరుణ, చేవెళ్ల బస్టాండ్ విధులు నిర్వహిస్తున్న కంట్రోలర్ రామస్వామి తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన మొహినుద్దీన్ శంకర్‌పల్లి నుంచి ఆర్టీసీ బస్సులో షాద్‌నగర్ వెళ్తుండగా బస్సులో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారు. తోటి ప్రయాణికుడికి ఈ ఫోన్ దొరకడంతో వికారాబాద్ డీఎం, కంట్రోలర్ రామస్వామికి అప్పగించారు. వారు ఆ ప్రయాణికుడి వివరాలు తెలుసుకొని సెల్‌ఫోన్‌ను బాధితుడికి అప్పగించారు.

పేకాట శిబిరంపై దాడి

మొయినాబాద్, జనవరి 4 : ప్రభుత్వ కార్యాలయాలకు ఎదుట మొయినాబాద్ శివారులో పేకాట అడుతున్న శిబిరంపై పోలీసులు దాడి చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గుడిమల్కాపూర్‌కు చెందిన ఏడుకొండలు, శేరిలింగంపల్లికి చెందిన ఏడుకొండలు, కొండాపూర్‌కు చెందిన అంకమ్మ, హిమాయత్‌నగర్‌కు చెం దిన మల్యాద్రి, బండ్లగూడకు చెందిన మురళి, మొయినాబాద్‌కు చెందిన కృష్ణ, రమణ, కృష్ణారావు మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేకాట ఆడుతున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి నిర్వహించారు. వారి వద్ద రూ.1.34.900ల నగదు, 3 సెట్ల పేక ముక్కలను స్వాధీనం చేసుకుని పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి

ముకునూరు నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలు తెలుసుకుంటున్న ఏపీడీ నరేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 4 : నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని ఏపీడీ నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ముకునూరు గ్రామంలో పర్యటించిన ఆయన నర్సరీల్లో పెంచుతున్న వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలపై తీసుకుంటున్న జాగ్రత్తలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్లక్ష్యం వహించకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో తిరుపతి చారి, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, కారోబార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ గురునాయుడు

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 4 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీఐ గురునాయుడు అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలోని అంబేద్కర్ చౌరస్తాలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో ప్రతిరోజూ వాహనాలను పట్టుకుని అవగాహన కల్పిస్తున్నా.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీ, కౌన్సిలర్ విద్యారెడ్డి తదితరులు

పెద్దఅంబర్‌పేట, జనవరి 4: మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు పెద్దఅంబర్‌పేట మైత్రి లహరి కాలనీలో రూ.5 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యారెడ్డితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగల జయశ్రీ శంకుస్థాపన చేశారు. పనులు నాణ్యతగా చేపట్టాలని, సకాలంలో పూర్తి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకుని రావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి విజేందర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు భిక్షమయ్య, రమణమూర్తి, మధుకర్‌రెడ్డి, భాస్కర్ రావు, లింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవి, మురళి, రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో ప్రారంభమైన ఇస్తేమా



ఇస్తేమా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల రూరల్, జనవరి 4 : శంకర్‌పల్లిలో ఇస్తేమా గాహ్ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ సమావేశంలో తొలిరోజైన శనివారం ముస్లింలు భారీ సంఖ్యలో హాజరై.. ప్రార్థనలు నిర్వహించారు. పలువురు మౌలామ్లు ఇస్లాం మతం అవశ్యకత, సమానత్వంపై ప్రసంగాలు ఇచ్చారు. భక్తులకు పుణ్య జీవితాన్ని గడపడం, ఇస్లాం నిషేధించిన వాటికి దూరంగా ఉండడం, తబ్లీగీ జమాత్ సందేశాలను ఇతరులకు చేరవేయడంపై వివరించారు.

ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దు

ఇస్తేమా కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మీప్రవీణ్‌కుమార్‌తో కలిసి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ముందుగా కంట్రోల్ రూమ్‌కు వెళ్లి కార్యక్రమం నిర్వహణపై అధికారులు, మత పెద్దలతో చర్చించారు. వంటలు, తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు తదితర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం మెడికల్ క్యాంపును సందర్శించి మందులను పరిశీలించారు. అస్వస్థతకు గురై క్యాంపులో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వైద్యులు అందుబాటులో ఉండాలని, ముస్లింలకు చిన్న ఇబ్బందులు ఎదురైనా వెంటనే చికిత్స చేయాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం కార్యక్రమ ఇన్‌చార్జి ఆర్డీవో చంద్రకళ, నార్సింగి ఏసీపీ రమణాగౌడ్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సమావేశం ఆదివారం సాయంత్రం ముగియనున్నందున వెళ్లే సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళిక బద్ధంగా అందరూ వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

స్వచ్ఛందంగా పనిచేసిన వలంటీర్లు

ఇస్తేమా కార్యక్రమ నిర్వహణలో వందల మంది ముస్లిం వలంటీర్లు స్వచ్ఛందంగా పని చేశారు. పార్కింగ్, వంటలు, మెడిసిన్, తాగునీరు.. ఇతర అవసరాలను దగ్గరుండి చూసుకున్నారు. పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే తాండూరు, వికారాబాద్, పటాన్‌చెరు, సంగారెడ్డి ప్రాంతాలను వచ్చే వాహనాలను దారి మళ్లించిన విషయం తెలిసిందే. సమావేశం రోజు సైతం ఎంట్రీ, ఎగ్జిట్ వద్ద భారీ కేడ్లు ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ జామ్ కాకుండా చూసుకున్నారు. ఇందులోనూ చాలా వరకు వలంటీర్లే పని చేస్తూ కనిపించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేద ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం శంకర్‌పల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు రూ.60 లక్షల పైచిలుకు నిధులకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సాత విజయలక్ష్మీప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేందర్, వార్డు కౌన్సిలర్లు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

యువనాయకుడు కార్తీక్‌రెడ్డితో మహేందర్‌రెడ్డి

కందుకూరు, జనవరి 4 : బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని యువనాయకుడు కార్తీక్‌రెడ్డి కోరారు. శనివారం మండల సీనియర్ నాయకుడు సామ మహేందర్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి రావడానికి ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించినట్లు చెప్పారు. ప్రభుత్వానికి ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. బీఆర్ఎస్‌లో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుందని వివరించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రవీందర్‌గౌడ్, ప్రభాకర్ ఉన్నారు.